# చీకటిలో....?

రచన :
హంటర్

టేబిలుముందు లాక్కుని కాగితం కలం తీసేను కథ రాద్దామని—

భావాలు బుర్రలో పీఠం వేసుకుని కూర్చున్నాయి—నాలుగుపంక్తులు రాసేను...కొట్టేసేను ...జేబులోని శిగరెట్టుపెట్టి తీసి ఒక ధవళకాష్టాన్ని అంటించే—

నాలోని భావాలు యేమిటేమిటో చెప్తూ గందరగోళం చేస్తున్నాయి—ఒంటెత్తు జీవనం నా కళ్ళెదుట ప్రత్యక్షమైంది—

లక్ష్మిని విడిచి అప్పుడే రెండునెలలైంది... ఈ రెండునెలలోనూ నా శరీరం పూర్తిగా మారిపోయింది—దబ్బకుంటులాంటి నా దేహచ్ఛాయ...మసిబొగ్గులా అయిపోయింది—

ఇప్పుడు నన్నెవరైనా పోల్చుకోగలరా...???

పాలిపోయిన ముఖం...చిక్కిపోయి శరీరం నా మట్టుకు నాకే ఆశ్చర్యం వేస్తూంది—

మనస్సు దేనిగురించో కొట్టుకుంటూంది—

నా జీవితంకూడా ఒడుదుడుకులు లేకుండా ఎప్పుడు వుంటుందా అనుకున్నా—ఆలోచనలతోనే అర్ధరాత్రి గడిచింది—

చేతిలోని శిగరెట్టు పూర్తిగా కాలిపోయ్యి ఐపూరుకుంది—

మరోటి తీసి వెలిగించేను—

కుటుంబాన్ని తెచ్చుకుంటే...???

హృదయంలో ఆశ... సంతోషం... ఒక్కసారే ప్రవేసించేయి...

అయితే......!

అధికారి శలవిస్తాడా...? అదే సంశయం—

దాస్యంలో పడికొట్టుకుంటున్న నాకు స్వాతంత్ర్యం లేకపోయింది కదా అని విచారించాను-...మనస్సు చిక్కుకుంది—

ఆ క్షణంలో పంపిన కథ పత్రికలో పడకపోతే...ఆ కథకుడికి కలిగే నిరాశ...విచారం... యెంతమట్టుకు చర్యలు జరిగిస్తాయో అంతా జరిగింది.

కృంగిపోయిన హృదయంతో కలాన్ని కాగితంమీద పెట్టేను...విసుగుదల కలిగించింది మనస్సు ...కలాన్ని టేబిలుమీదపెట్టి లేచి బద్ధకంతో మంచంమీద వ్రాలెను—

ఎడతెరిపిలేని ఆలోచన...

ప్రపంచంలో బ్రహ్మచారులు యేలా జీవిస్తున్నారా అన్న సమస్యను పీడించింది—

మొన్న ఓమాటు వి...భా...ని యీ ప్రశ్నే వేస్తే విశ్వంలో బ్రహ్మచారులే లేరంటు కొట్టిపారేసేడు—

ఇది సత్యమేనా...???

ఒత్తిగిలి తలగడాని సరిచేసుకుని పడుక్కున్నా...ఓ మాటు కాలీపట్నానికీ నాకు సారస్వత చర్చలో వివాదం. వచ్చింది—

అతి తేలికపదాలతో కథలు రాస్తే అందరికీ అర్థం అయి ఆకర్షిస్తాయంటాడు.

శరత్‌బాబు పాత్రను సృష్టిస్తున్నప్పుడుగాని విసుగుదల కలిగితే ఆ పాత్రని దేశపర్యటనం చేయిస్తారు—అంచేత మనంకూడా వాస్తవిక జీవితాలను చిత్రిస్తూన్నప్పుడు విసుగుదల కలిగితే...ఉద్రేకపదాలతో ఆ పాత్రని రసవంతంగా చేయవచ్చు...రచయిత మనస్సుకూడా వికసిస్తుంది—మూలం...నవ్యపద సమానాలే అంటూ నేను—

వాదన తెగలేదుగాని యీ నాటివరకూ అతగాడి భావంలోవున్న అంతరార్థం తెలియలేదు...

ఏమిటీ పిచ్చి ఆలోచన అనుకున్నా...నవ్వొచ్చింది అయినా...మనస్సు పరిపరివిధాలగా పోతున్నాది—

దీపం...చమురులేక కునకటం ప్రారంభించింది—ఆవులించి కళ్లుమూసేను—

చిత్రవిచిత్రభావాలు...వ్యక్తులూ...కలలోని బొమ్మలులా కనిపించి యేమిటో బోధిస్తున్నారు—

చెవులకు వినిపిస్తున్నా భావాలకి అందకుండా వున్నాయి

—మూసినకళ్లు తెరిచేను—

అంతా చీకటిమయంగావుంది— ఆ చీకటిలోనే...యింకా...యింకా...యేమిటో ఆలోచిస్తున్నా—

నాలుగుగోడల మధ్య నా చిక్కిపోయిన నా భావాలు పైకి రాలేకుండా వున్నాయి...

అయినా అ...కటిక చీకటిలోనే యింకా ఆలోచిస్తున్నా—